ప్రజాశక్తి
ఆదివారం 24 డిసెంబర్ 2023
5
శ్రీ సత్యసాయి

అన్నదాత ఇంట మృత్యుచీకటి

ప్రమాదంలో మృతి చెందిన నలుగురూ సాధారణ మధ్య తరగతి రైతులే కావడం విచారకరం. ఈ ఘటనతో ఆ రైతుల ఇంటి చీకట్లను మిగిల్చింది. వ్యవసాయం తప్పా వేరేజీవనాధారం లేదు. అలాంటి వారు అనుకోని ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబాలు కకావికలం అయ్యాయి.

◆ **రైతు పసులూరు శ్రీరాములు** వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగించేవాడు. ఆయనకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె సునీతకు వివాహమయ్యింది. చిన్న కుమార్తె ఇందు బిటెక్ చదువుతోంది. వ్యవసాయం చేస్తూనే పిల్లలను బాగా చదివించి ప్రయోజకులను చేయాలని భావించాడు. అనుకోని ప్రమాదంలో ఇంటి పెద్ద మరణించడంతో ఆ కుటుంబంలో విషాధం మిగిల్చింది.

◆ **రైతు కండ్లపల్లి చిన్న తిప్పయ్యకు** వ్యవసాయమే జీవనాధారం. ఆయనకు భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు వ్యవసాయం, చిన్న కుమారుడు పురుషోత్తం డిగ్రీ చదువుతున్నాడు. కుమారులతో కలిసి వ్యవసాయం చేసుకుని ఈయన కుటుంబాన్ని పోషించుకునేవాడు. కుమారులను మంచి ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలనే తపనవాడేవారు. ప్రమాదంలో ఆయన మరణించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



◆ **రైతు కండ్లపల్లి నాగార్జునకు** వ్యవసాయం అంటే చాలా ఇష్టం. పంట సాగు చేస్తూనే కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆయన భార్య జయలక్ష్మి, కుమారుడు అభినవ్, కుమార్తె మన్విత ఉన్నారు. తనకున్న మూడెకరాల పొలంలో వరి పంటను సాగు చేపేవాడు. వచ్చిన వరి ధాన్యాన్ని విక్రయించి దాని ద్వారా వచ్చే డబ్బుతో కుటుంబాన్ని పోషించేవాడు. అలా బియ్యాన్ని తీసుకొచ్చేందుకు వెళ్లిన వ్యక్తి అనుకోని ప్రమాదంలో మరణించడం ఆ కుటుంబాన్ని అంధకారంలోకి నెట్టేసింది.

◆ **రైతు మామిళ్లపల్లి శ్రీనివాసులు** మరణించడం అత్యంత విషాధకరం. ఈయన భార్య మౌనిక బాలింత. నాలుగు నెలల క్రితమే ఈమె మగ బిడ్డకు జన్మనిచ్చింది. శ్రీనివాసులు వ్యవసాయంతో పాటు ఆటో నడుపుతూ కుటుంబాన్ని జీవనం పోషించుకునేవాడు. ఎకరం మెట్ట భూమి, అర ఎకరం మాగానిలో పంటలు సాగు చేవాడు. ప్రమాదంలో ఈయన మరణించడంతో నాలుగు నెలల చిన్నారితో భార్య రోధిస్తున్న తీరు అక్కడున్న వారిని కంటతడిపెట్టించింది.

ఘటనా స్థలంలో నుజ్జునుజ్జైన ఆటో

అన్నదాత ఆఖరి ప్రయాణం..!

ఆరుగాలం శ్రమించి పండించిన పంటను ఇంటికి తీసుకెళ్లేందుకు సిద్ధమైన అన్నదాతలలకు అదే ఆఖరిప్రయాణం అయ్యింది. వర్షం చినుకు నింగిని తొంగిచూడకున్నా, ఉన్న కొద్దిపాటి నీటి వనరులతో వరిపంటను సాగు చేశారు. పంటను కోత కోసి వడ్లను బియ్యంగా మార్చుకున్నారు. సంతోషంగా బియ్యాన్ని ఇంటికి తీసుకెళ్తున్న సమయంలో అనుకోని ప్రమాదం వారి ఆయువును తీసింది. ఏకంగా నలుగురు రైతులు ఘటనా స్థలంలోనే మరణించారు. గార్లదిన్నె మండలం కల్లూరు పెన్నానది వంతెన 44వ జాతీయ రహదారిపై శనివారం వేకువజామున చోటు చేసుకున్న ఈ ఘటన పెను విషాధాన్ని మిగిల్చింది. మృతులలంతా ఒకే గ్రామం, ఒకే కుటుంబానికి చెందిన దాయాది వరుస అన్నదమ్ములు కావడంతో వారి బంధువులు, కుటుంబ సభ్యుల రోదనలతో గ్రామం కన్నీటి సంద్రం అయ్యింది. అంతర్జాతీయ రైతు దినోత్సవం రోజున నలుగురు రైతులు అనుకోని ప్రమాదంలో మృత్యుఒడికి చేరడం అన్నదాతలకు తీవ్ర దు:ఖాన్ని మిగిల్చింది.

- ◆ వేకువజామున కబళించిన మృత్యువు
- ◆ కల్లూరు నేషనల్‌హైవేపై ఘోర ప్రమాదం
- ◆ అక్కడికక్కడే నలుగురు రైతులు మృతి
- ◆ మరోకరికి తీవ్రగాయాలు
- ◆ మృతులలంతా ఒకే గ్రామం.. ఒకే కుటుంబానికి చెందిన బంధువులు
- ◆ రైతుదినోత్సవం నాడు పెనువిషాదం

ప్రజాశక్తి-గార్లదిన్నె, గుత్తి

గుత్తి మండలం మాముడూరు గ్రామానికి చెందిన కుమ్మరి చిన్నతిప్పన్న(48), కుమ్మరి శ్రీనివాసులు(47), కుమ్మరి నాగార్జున (32), కుమ్మరి శ్రీనివాసులు(30)లు దాయాది వరుస అయ్యే అన్నదమ్ములు వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తుంటారు. ఇటీవల సాగు చేసిన వరిపంటను కోత కోసి వడ్లను బియ్యంగా మార్చుకునేందుకు శుక్రవారం రాత్రి గార్లదిన్నె మండలం కల్లూరు వెంకటరాముడికి చెందిన రైస్ మిల్లుకు తీసుకొచ్చారు. అక్కడ వడ్లను బియ్యంగా మార్చుకుని ట్రాక్టర్లో వాటిని తీసుకుని స్వగ్రామానికి బయల్దేరారు. శనివారం వేకువజామున 3గంటల సమయంలో కల్లూరు పెన్నానది వంతెన 44వ జాతీయ రహదారిపై వెళ్తుండగా కర్నూలు వైపునకు వెళ్తున్న ప్రయివేటు ట్రావెల్స్ బస్సు ట్రాక్టర్‌ను వెనుకవైపు నుంచి అతివేగంగా ఢీకొంది. దీంతో ట్రాక్టర్లో ఉన్న నలుగురు రైతులు ఎగిరి రోడ్డుపై పడ్డారు. వేగంగా వచ్చిన బస్సుచక్రలు వారి మీదుగా వెళ్లాయి. దీంతో ఘటనా స్థలంలోనే రైతులు కుమ్మరి చిన్నతిప్పన్న, కుమ్మరి శ్రీనివాసులు, కుమ్మరి నాగార్జున, కుమ్మరి శ్రీనివాసులు అక్కడికక్కడే మరణించారు. కుమ్మరి హరి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనతో ఒక్కసారిగా ఆ ప్రాంతం భీతావాహకంగా మారిపోయింది. ఈ ట్రాక్టర్ ముందు వెళ్తున్న మరో ట్రాక్టర్లోని రైతులు ప్రమాదాన్ని గుర్తించి ప్రయివేటు బస్సును అక్కడే ఆపేశారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని 108 సాయంతో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రయివేటు బస్సు డ్రైవర్ నిద్రమత్తులో ఉండడం, అతివేగంగా బస్సును నడపడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఘటనా స్థలంలో రైతుల మృతదేహాలు...



ప్రమాదానికి కారణమైన బస్సు...

మామడూరులో విషాధం

మృతి చెందిన రైతులందరూ గుత్తి మండలం మామడూరు గ్రామానికి చెందిన వారు కావడంతో అక్కడ విషాదఛాయలు అలముకున్నాయి. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను శనివారం సాయంత్రం స్వగ్రామానికి తీసుకొచ్చారు. ఒక్కసారిగా నలుగురి మృతదేహాలు రావడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనతో ఒక్కసారిగా గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

మృతులలంతా బంధువులే..

ప్రమాదంలో మృతి చెందిన వారంతా ఒకరికి ఒకరు సమీప బంధువులు అవుతారు. కుమ్మరి సామాజిక వర్గానికి చెందిన వీరంతా మామడూరు గ్రామంలో ఒకే ప్రాంతంలో నివశించేవారు. చిన్నతిప్పయ్య, నాగార్జునలు వరుసకు తండ్రి కుమారులు అవుతారు. శ్రీరాములు వారికి సమీప బంధువు. శ్రీనివాసులుకు మిగతా ముగ్గురు మామలు అవుతారు.

బాధితుల ఆందోళన

అతివేగంతో ప్రమాదానికి కారణం అయిన ప్రయివేటు బస్సు యజమాన్యం మృతి చెందిన రైతుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ బంధువులు ఘటనా స్థలంలో ఆందోళనకు దిగారు. మృతి చెందిన ఒక్కొక్కరికి రూ.20 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేంత వరకు మృతదేహాలను తీసుకెళ్లమంటూ అక్కడే బైటాయించారు. పోలీసులు వారికి సర్ధిచెప్పి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చి వారితో ఆందోళన విరమించారు. ఒకే గ్రామం, ఒకే కుటుంబానికి చెందిన నలుగురు రైతులు మృతి చెందడంతో మామడూరు గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

ధర్మవరంలో మోకాళ్లపై నిలబడి చేతులుజోడించి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు, సిఐటియు నాయకులు

పోరాటమే నినాదం..!

◆ 12వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె ◆ అన్ని ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు

అంగన్‌వాడీ 12వ రోజు సమ్మె

సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె పోరాటమే నినాదంగా కొనసాగుతోంది. ప్రభుత్వం స్పందించేంత వరకు పోరు ఆగదంటూ అంగన్‌వాడీలు స్పష్టం చేస్తున్నారు. శనివారం నాటికి సమ్మె 12వ రోజుకు చేరుకుంది. కార్యకర్తలు, హెల్పర్లు మండల కేంద్రాల్లో నిరసన ర్యాలీలు చేస్తున్నారు. మానవహారాలు, భిక్షాటన, ఒంటికాలిపై నిరసన తదితర రూపాల్లో ఆందోళనలు కొనసాగిస్తున్నారు. వైసిపి పాలకులు మొండి వైఖరి విడనాడి అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు హామీలను ఇచ్చి వాటిని అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం అత్యంత దుర్మార్గం అని అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించేంత వరకు సమ్మెను విరమించేది లేదని స్పష్టం చేస్తున్నారు.

వార్త 6లో

హామీలు అమలు చేయలేరా..?

- ◆ ముఖ్యమంత్రిని ప్రశ్నించిన ఎస్ఎస్ఎ ఉద్యోగులు
- ◆ 4వ రోజు కొనసాగిన సమ్మె

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

తామేమీ గొంతెమ్మ కోర్కెలు కోరలేదని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయమనే కోరుతున్నామంటూ ఎస్ఎస్ఎ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసవేతనాలు, ఎన్నికల హామీలు, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ ఎస్ఎస్ఎ ఉద్యోగులు పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మె శనివారం 4వ రోజు కొనసాగింది. దీక్షా శిబిరంలో ఉద్యోగులు కూర్చొని నిరసన తెలిపారు. వీరికి పలువురు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనంకి అశోక్ కుమార్ సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె న్యాయమైనదన్నారు.

సమగ్రశిక్షా 4వ రోజు సమ్మె

పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మెకు మద్దతు తెలిపి ప్రసంగిస్తున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్

జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలన్నారు. వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులను అణచివేసే చర్యలను మానుకోవాలని హితవు పలికారు. సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనలు మరింత తీవ్రం అవుతాయన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ బిఎ.ముత్యాలప్ప, జిల్లా ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి, బలరాముడు రాష్ట్ర కౌన్సిలర్ పి.శ్రీనివాసులు పుట్టపర్తి మండల శాఖ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, కనగానపల్లి మండల శాఖ అధ్యక్షులు నాగేంద్ర, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, నాయకులు శంకర్ నారాయణ, బయన్న, సుధాకర్ పాల్గొన్నారు.

కదిరి లక్ష్మీనరసింహస్వామి వద్ద బారులుదీరిన భక్తులు

వైకుంఠ ఏకాదశి వేడుక

కదిరి టౌన్ : జిల్లా వ్యాప్తంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. వైష్ణవ క్షేత్రాల్లో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఉత్తర ద్వారాన్ని తెరిచారు. ఉత్తరద్వారం స్వామివార్లను దర్శనం చేసుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాల వద్దకు చేరుకున్నారు. శనివారం వేకువజాము 2 గంటల నుంచే ఆలయాల వద్ద భక్తులు క్యూలో నిల్చున్నారు. కదిరి లక్ష్మి నరసింహస్వామి దర్శనం చేసుకునేందుకు ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా కర్నాటక రాష్ట్రం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చారు. ఆలయం నుంచి పెద్ద ఎత్తున క్యూలైన్లలో భక్తులు నిల్చొన్నారు. ఆయా ఆలయాల వద్ద వైకుంఠ ఏకాదశిని పురస్కరంచుకుని ఆలయ కమిటీ, అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లను చేశారు.

పకడ్బందీగా రీ-సర్వే

జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-పెనుగొండ

భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన రీసర్వేను పకడ్బందీగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పెనుగొండ సబ్ కలెక్టర్ కార్యాలయంలోని భువన విజయం నందు మూడో విడత రీసెర్వేపై అమలపై అధికారులతో శుక్రవారం నాడు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ల్యాండ్ సర్వే సహ సంచాలకులు రామకష్ణ, సర్వే సిబ్బంది, మండల సర్వేర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ఆయా గ్రామాల్లో రైతులకు సంబంధించిన హద్దులు చూపించి రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రాళ్లను పాతించాలన్నారు. సర్వే టీం గ్రౌండ్ టూ థింగ్ గ్రౌండ్ వాల్యుయేషన్ ప్రక్రియను ప్రభుత్వ నిబంధనల మేరకే చేపట్టాలన్నారు. రీ సర్వే పనులను పక్కాగా చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్వేయర్ల కథలు చెప్పకుండా జాగ్రత్తగా విధులను నిర్వర్తించాలన్నారు. రీ సర్వేలో కదిరి డివిజన్ చాలా వెనకబడి ఉందని, అక్కడి సిబ్బంది దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని మండలాల సర్వేర్లు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్ల పట్టాలివ్వాలి

వ్యకాసం రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాణి

విఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న వ్యకాసం నాయకులు

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

మండల పరిధిలోని పాలసముద్రం గ్రామంలో ఇళ్ల పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ వెంటనే పట్టాలివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాణి డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మండల పరిధిలోని పాలసముద్రం గ్రామ సచివాలయం వద్ద ఇళ్ల స్థలాల సాధన పోరాట కమిటీ అధ్యక్షులు అశ్విని అధ్యక్షతన ధర్నాను శనివారం నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగరాణి మాట్లాడుతూ పాలసుమద్రం పంచాయతీ పరిధిలో ఇళ్లు లేని నిరుపేదలు 360 మంది రెండు నెలల క్రితం దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరికి ఇంటి పట్టాలు ఇవ్వడంలో అధికారులు కాలయాపన చేస్తున్నారన్నారు. అధికారుల తీరును నిరసిస్తూ సర్వే నంబర్ 125లో పేదలు గుడిసెలు వేసుకుని నివాసం ఉన్నారన్నార. వీరందరికీ తక్షణం ఆప్రాంతంలో ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పేదల పక్షాలన సిపిఎం, వ్యకాసం పోరాటం చేస్తుంటే కొందరు నాయకులు పనిగట్టుకుని ఆ పార్టీ నేతలపై దుష్ప్రచారాలు చేస్తున్నారని, ఇది అత్యంత దుర్మార్గం అన్నారు. చేతనైతే పేదలకు స్థలాలు ఇచ్చి నాయకులు చిత్త శుద్ధి నిరూపించు కోవాలి తప్పా, సమస్యను తప్పుదోవ పట్టించేలా ఇలా ప్రవర్తించడం సరికాదని హితవు పలికారు. పాలసముద్రం గ్రామంలో చాలా మంది వ్యవసాయ కూలీలు ఉన్నారని, వీరి కోసం ఉపాధి పనులను 200 రోజులు కల్పించాలని కోరారు. కరువు మండలంగా ప్రకటించిన నేపథ్యంలో రైతులను ఆదుకునే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని వీఆర్వోకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, ఉపాధ్యక్షులు వెంకటేష్, సీపీఎం కమిటీ సభ్యులు వెంకటేష్, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ కార్యదర్శి వజీర్, సభ్యులు అంజలి, షాతాజ్, అచ్చమ్మ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తే చర్యలు

ఆహార భద్రత అధికారిణి పి.తస్లీమ్

హిందూపురం : హిందూపురం పురపాలక సంఘ వ్యాప్తంగా సూపర్ మార్కెట్ నిర్వాహకులతో పాటు హోటల్స్, రెస్టారెంట్లు, చికెన్ కబాబ్, గోబి సెంటర్లు తదితర వారు కల్తీ ఆహార పధర్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆహార భద్రత అధికారిణి పి.తస్లీమ్ హెచ్చరించారు. శనివారం పట్టణంలో సుపర్ మార్కెట్‌తో పాటు పలు హోటల్స్, కబాబ్, గోబీ సెంటర్లు, నూనె వ్యాపార దుకణాలలో ఆకస్మిక తనఖీలు నిర్వహించారు. హోటల్, రెస్టారెంట్లకు తప్పనిసరిగా ఎఫ్ఎస్ఎస్ఎఐ అనుమతులు ఉండాలన్నారు.

పివి ఆశయాలు కొనసాగిద్దాం

హిందూపురం : తెలుగు బిడ్డ, బహుబాషా కోవిదుడు, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఆశయాలను కొనసాగిద్దామని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణాధ్యక్షుడు జమీల్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వర్ధంతిని పురష్కరించకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీసీసీ జనరల్ సెక్రటరీ బాలాజీ మనోహర్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ మరణానంతరం అధికారంలో మైనారిటీగా ఉన్న కేంద్ర ప్రభుత్వాన్ని పివి సమర్థవంతంగా పరిపాలించాడన్నారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ ప్రెసిడెంట్ అమానుల్లా, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ మహబూబ్ బాషా, జిల్లా మైనారిటీ సెల్ వైస్ ప్రెసిడెంట్ ఎండీ గౌస్, లేపాక్షి మండల బీసీ సెల్ ప్రెసిడెంట్ సంజీవప్ప, నాయకులు పెరిస్వామి, అజ్మతుల్లా, ఆదినారాయణప్ప పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి జి శ్రీనివాస్

కేసుల పరిష్కారానికి కృషి చేద్దాం

ఉమ్మడి అనంతపురం జిల్లా న్యాయమూర్తి జి.శ్రీనివాస్

ప్రజాశక్తి-హిందూపురం

న్యాయాధికారులు, న్యాయవాదులు సమన్వయంతో వ్యవహరించి కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేద్దామని ఉమ్మడి అనంతపురం జిల్లా న్యాయమూర్తి జి.శ్రీనివాస్ సూచించారు. శనివారం స్థానిక సీనియర్ సివిల్ కోర్టు రికార్డుల పరిశీలన నిమిత్తం హిందూపురం వచ్చారు. ఈ సందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లా న్యాయమూర్తి జి.శ్రీనివాస్‌కు స్థానిక అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ, సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మిలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అదనపు జిల్లా కోర్టుతో పాటు జిల్లా న్యాయమూర్తి అన్ని కోర్టులను క్షుణ్ణంగా పరిశీలించారు. అదేవిధంగా కోర్టు ఆవరణాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టులోను సిబ్బంది కొరత ఉందన్నారు. జిల్లాలోని ప్రాంతాల్లో న్యాయాధికారుల కొరత కూడా ఉన్నట్లు తెలిపారు. త్వరలోనే స్థానికంగా ఖాళీగా ఉన్న పీడీఎం కోర్టుకు న్యాయాధికారిని నియమించే అవకాశం ఉందన్నారు. అదనపు జిల్లా జడ్జితో పాటు సీనియర్ జూనియర్ జడ్జిలు ఎంతో పనిభారం ఉన్నప్పటికీ సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారని కితాబిచ్చారు. ఇదిలా ఉండగా ప్రమాద బీమా కేసులకు సంబంధించి కోర్టు ఫీజులను చెల్లించడంలో ఒకింత ఉపశమనం కలిగిస్తున్నట్లు తెలిపారు. అనంతరం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా జడ్జిని ఘనంగా సన్మానించి మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు న్యాయవాదులు పాల్గొన్నారు. అనంతరం కోర్టు ఆవరణలో న్యాయమూర్తి మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం పట్టణంలోని పేట వెంకటరమణ స్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పోరాటమే నినాదం

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసనలు
వివిధ రూపాల్లో ప్రదర్శనలు

పుట్టపర్తి : అంగన్వాడీల దీక్షా శిబిరంలో పాల్గొన్న ఈఎస్ వెంకటేష్

హిందూపురం : శిబిరంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్‌పి శ్రీనివాసులు

ఏకపక్షంగా జీవోల జారీ సిగ్గుచేటు : ఈఎస్ వెంకటేష్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

రాష్ట్ర ప్రభుత్వం యూనియన్ నాయకత్వంతో చర్చలు జరిపిన సందర్భంలో అంగీకరించని అంశాలపై కూడా ఏకపక్షంగా జీవోలు జారీ చేయడం సిగ్గుచేటని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ తెలిపారు. సమ్మెలో భాగంగా అంగన్వాడీలు 12వ రోజైన శనివారం పుట్టపర్తి ఐసిడిఎస్ కార్యాలయం ముందు చేపట్టిన దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ కళ్లుండి చూడలేని కబోది ప్రభుత్వమని, చెవులు ఉండి వినలేని చెవిటి ప్రభుత్వమని, నోరు ఉండి మాట్లాడలేని మూగి ప్రభుత్వమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చే ఏకపక్ష ఉత్తర్వులను ఖండిస్తున్నామన్నారు. అంగన్వాడీల పట్ల ఆరోపణలు, చిన్నచూపు చూస్తే పుట్టుగతులు ఉండవని హెచ్చరించారు. దీక్షలో ప్రాజెక్టు అధ్యక్షులు సుజాత, కార్యదర్శి నాగమణి, కోశాధికారి మంజుల, నాయకురాళ్లు అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్, మినీ అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కథలు చెప్పొద్దు.. సమస్యలు తీర్చండి

హిందూపురం : ప్రభుత్వం కథలు చెప్పకుండా అంగన్వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్‌పి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. అంగన్వాడీ కార్యకర్తలకు జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె శనివారానికి 12వ రోజుకు చేరుకుంది. శనివారం పట్టణంలోని సద్భవన్ సర్కిల్‌లో అంగన్వాడీలు రిలే దక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా దీక్షలకు సంఘీబావం తెలిపిన సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్‌పి శ్రీనివాసులు మాట్లాడుతూ అంగన్వాడీలు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ 12 రోజులుగా శాంతియుతంగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి కనబడటం లేదా,? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం వేతనాలు పెంచాలని నిరసన కార్యక్రమాలు చేపట్టిన ఏమాత్రం స్పందించకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా తమ న్యాయమైన కోర్కెలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు సాంబ శివ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి లావణ్య, యూనియన్ నాయకులు శైలజ, వరలక్ష్మి, శోభ, శిరీషా, నాగమ్మ, జ్యోతమ్మతో పాటు అంగన్వాడీలు పాల్గొన్నారు.

పెనుకొండ : సమ్మెలో భాగంగా పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు చేపట్టిన శిబిరంలో అంగన్వాడీలు దీక్షలను కొనసాగించారు. వేతనాలు పెంచకుండా పంగనామాలు పెట్టిన సిఎం జగన్‌మోహన్‌రెడ్డి గోవిందా అని నినాదాలు చేశారు. శిబిరాన్ని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వ్య.కా.సం జిల్లా కమిటీ సభ్యులు వెంకటరాముడు, నారాయణ, యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు బావమ్మ, సెక్టార్ లీడర్లు మాబున్నీసా, వరలక్ష్మి, పార్వతమ్మ, వెంకటరత్నం, లక్ష్మీదేవి, అనిత, శ్యామల, గౌరి, తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాబున్నీసా ఆధ్వర్యంలో అంగన్వాడీలు స్థానిక జడ్పి హైస్కూల్ నుంచి పోలీస్ స్టేషన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. దీక్షా శిబిరాన్ని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ సందర్శించి సంఘీభావం తెలిపారు. దీక్షల్లో లక్ష్మీదేవి, భారతి, సుజాత, టిడిపి మండల కన్వీనర్ కొండయ్య, ప్రసాద్, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : అంగన్వాడీలు మూతికి నల్ల రిబ్బన్ కట్టుకొని పట్టణంలోని ఆర్అండ్‌బి నుంచి కాలేజ్, అంబేద్కర్ సర్కిల్ మీదగా మున్సిపల్ కార్యాలయం వరకూ మౌన ప్రదర్శన చేపట్టారు. వీరికి స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాకే హరికుమార్ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్లు చంద్రకళ, సుశీల, రామలక్ష్మమ్మ, శారద, ప్రమీల, లక్ష్మీదేవి, సిఐటియు నాయకులు జివిఎల్.నరసింహులు, బాబ్జాన్, రామ్మోహన్, విజయ్ పాల్గొన్నారు.

నల్లచెరువు : అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు స్థానిక బస్టాండ్ కూడలి నుంచి ఐసిడిఎస్ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లి అక్కడ శిబిరంలో రిలే దీక్షలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షుడు రామకృష్ణ, రైతు సంఘం జిల్లా కౌన్సిల్ సభ్యులు శ్రీరాములు, వ్య.కా.సం కోశాధికారి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : సమ్మెలో భాగంగా స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ముందు చేపట్టిన దీక్షా శిబిరంలో అంగన్వాడీలు రిలే నిరాహార దీక్ష చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. సమస్యలు తీరేంతవరకూ దశలవారీగా ఆందోళనలు చేపడతామని యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి, ఉషారాణి తెలిపారు.

పరిగి : సమ్మెలో భాగంగా అంగన్వాడీలు చేపట్టిన రిలే నిరాహార దీక్ష కొనసాగింది. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని, సమస్యలు పరిష్కారం అయ్యేవరకూ సమ్మెను ఆపేదే లేదని హెచ్చరించారు. దీక్షలో ప్రాజెక్ట్ ట్రెజరర్ పద్మావతి, సెక్టార్ లీడర్ శంకరమ్మ, మంజుల పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : సమ్మెలో భాగంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు సిఐటియు నాయకులతో కలిసి మోకాళ్లపై నిల్చొని మొక్కుతూ వినూత్నరీతిలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆదినారాయణ, ఆయూబ్‌ఖాన్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సిఐటియు నాయకులు బాలాజీ, పెద్దవలి, అంగన్వాడీలు పోతక్కదీనా, మాంచాలినిదేవి, అనిత, క్రిష్ణవేణి, భువనేశ్వరి, లలిత పాల్గొన్నారు.

చిలమత్తూరు : అంగన్వాడీల సమ్మె ఉధృతంగా కొనసాగింది. వీరికి టిడిపి, జనసేన నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు హిరంగి ప్రవీణ్ కుమార్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు లక్ష్మీనారాయణ, రామచంద్ర, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు శోభారాణి, రామ తులసి, పద్మావతి, జయమ్మ, వనజ, సునీత, మాలిని, ఈశ్వరమ్మ, శారద, పుణ్యవతి, తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం చేపట్టిన శిబిరంలో అంగన్వాడీ సిబ్బంది రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలో సిఐటియు నాయకులు రాజప్ప, ధనమ్మ, సంపూర్ణమ్మ, శశికళ, తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు దీక్షలను కొనసాగించారు. దీక్షలో సిఐటియు నాయకుడు మహబూబ్ ఖాన్, యూనియన్ లీడర్లు నాగవేణి, అనసూయమ్మ, మంజుల చంద్రకళ నాగరత్నమ్మ సారక్క తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యదర్శి మహదేవమ్మ ఆధ్వర్యంలో సెక్టార్ లీడర్లు, అంగన్వాడీ సిబ్బంది మెడలో పూలమాలలు వేసుకొని నిరసన తెలిపారు. శిబిరంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : అంగన్వాడీల దీక్షకు సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ సంఘీభావం తెలిపారు. దీక్షలో సిఐటియు మండల అధ్యక్షులు కుళ్లాయప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, అంగన్వాడీ యూనియన్ లీడర్లు రంగమ్మ, కమలమ్మ, ఆశీర్వాదమ్మ, వరలక్ష్మి, మణిమాల, కిష్టమ్మ, పద్మావతమ్మ, లక్ష్మీదేవి, పద్మావతి, తులసమ్మ, మినీ వర్కర్లు కమలమ్మ, శశికళమాని పాల్గొన్నారు.

ముదిగుబ్బ : నిరవధిక సమ్మెలో భాగంగా అంగన్వాడీలు రిలే నిరాహార దీక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు ఆటో పెద్దన్న, సిపిఐఎం నాయకులు బందల వెంకటేశు, పోతలయ్య, అంగన్వాడీలు రజియా, ఇందుమతి, నాగరత్న, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : శిబిరంలో బైఠాయించిన అంగన్వాడీలు

గాండ్లపెంట : మద్దతు తెలుపుతున్న కందికుంట

కదిరి : మౌనప్రదర్శనగా ర్యాలీ

మడకశిర : పూలమాలలు వేసుకుని దీక్ష చేపట్టిన అంగన్వాడీలు

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి : జెసి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

యువత, విద్యార్థులు, మహిళలు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. 'ఆడుదాం ఆంధ్ర'పై శనివారం మండల పరిధిలోని జగరాజుపల్లిలో మోడల్ స్కూల్ విద్యార్థులు చేపట్టిన జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన అవగాహన ర్యాలీని జెసి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మోడల్ స్కూల్ ప్రాంగణంలో విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. జెసి మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ నుంచి నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' పోటీల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 15 ఏళ్లు పైబడిన వారందరూ క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఉదయభాస్కర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్, కోచ్‌లు, పిడిలు, పిఇటిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేస్తున్న జెసి

టిడిపి నాయకులతో ఎమ్మెల్యే బాలయ్య సమావేశం

ప్రజాశక్తి-లేపాక్షి

స్థానిక ఓ ప్రయివేట్ ఫంక్షన్ హాలులో శనివారం ఎమ్మెల్యే బాలకృష్ణ పంచాయతీల వారీగా 12 పంచాయతీల ప్రజాప్రతినిధులు, నాయకులతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. రాబోయే ఎన్నిక ల్లో హిందూపురం నుంచి తనను ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే మీ సమస్యలు పరిష్కరిస్తా అని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కచ్చితంగా టిడిపి అధికారంలోకి వస్తుంది, ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలి అన్నారు. కార్యకర్తలు పంచాయతీల వారీగా అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జయప్ప, మాజీ జడ్పిటిసి ఆదినారాయణరెడ్డి, మాజీ ఎంపిపి ఆనంద్‌కుమార్, మండలంలోని నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలయ్య

'ఆడుదాం ఆంధ్ర'పై అవగాహన ర్యాలీ

రప్రజాశక్తి-కదిరి అర్బన్

గ్రామీణ క్రీడాకారులను వెలికి తీసేందుకే ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాన్ని రూపకల్పన చేసిందని ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్దారెడ్డి పేర్కొన్నారు. ఆడుదాం ఆంధ్రపై శనివారం పట్టణంలో చేపట్టిన అవగాహన ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. సిఎం జగన్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర ఈ నెల 26వ తేదీ నుంచి నెలరోజుల పాటు జరుగుతుందన్నారు. 5 క్రీడాంశాల్లో గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ పోటీలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీహరిబాబు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ నజమున్నీసా, వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

26 నుంచి మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఈ నెల 26వ తేదీ నుంచి మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మె చేయనున్నారని మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, సిఐటియు పట్టణ కార్యదర్శి పైపల్లి గంగాధర్ ప్రకటించారు. ఈ మేరకు శనివారం పట్టణంలో సమ్మె సన్నాహక బైక్ ర్యాలీని గణేష్ సర్కిల్ వరకూ నిర్వహించారు. వారు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్, భూగర్భ డ్రైనేజీ, పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో రవాణా రంగం జిల్లా అధ్యక్షులు పెడపల్లి బాబావలి, నాగార్జున, పెద్దన్న, గోవిందు, నరసింహులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు కార్మికులు

అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మండల అధికారుల తీరుపై వెంకటాపురం సర్పంచి శంకర్‌రెడ్డి, ఎంపిటిసి శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఎంపిపి తుమ్మల పర్వీన్ షామీర్ అధ్యక్షతన మండల సర్వసభ సమావేశం నిర్వహించారు. ఎంఇఒ సురేష్‌బాబు మాట్లాడుతుండగా సర్పంచ్, ఎంపిటిసి జోక్యం చేసుకొని వెంకటాపురం పంచాయతీలో చాలా ప్రభుత్వ పాఠశాలల్లో గదులపై పెచ్చులు ఊడి ప్రమాదం జరిగే అవకాశాలు చాలా ఉన్నాయన్నారు. చాలా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నా చర్యలు తీసుకోలేదని వైద్యాధికారి భానుప్రకాష్‌నాయక్‌పై మండిపడ్డారు. అనంతరం వివిధ శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎంపిడిఒ సిద్దారెడ్డి, తహశీల్దార్ రామ్‌నాథ్‌రెడ్డి, జడ్పిటిసి కుర్లి దామోదర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మల్లూరి లక్ష్మీదేవి, హౌసింగ్ ఎఇ హరి ప్రకాష్ రెడ్డి, ఆర్డబ్ల్యుఎస్ జెఇ.దీపికరెడ్డి, ఎఒ ఇలియాజ్ అహ్మద్, విద్యుత్ ఎఇ చంద్రనాయక్, ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయ కుమారి, ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలను ఆదుకోండి

బత్తలపల్లి : అనంతపురం జిల్లా పామిడి సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నలుగురు కుమ్మర కులస్తుల కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాల ని టిడిపి కుమ్మర శాలివాహన సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుమ్మర మదనాపు పోతులయ్య డిమాండ్ చేశారు. ఆయన శనివారం గుంతకల్లు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జితేంద్రగౌడ్‌తో కలిసి గుత్తి మండలం మాముడూరు గ్రామం వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి, జిల్లా కోశాధికారి కె.ఓబుళపతి, పామిడి ఓబులేసు, అప్పాజీపేట నాగరాజు, పెద్దన్న, జిల్లా కమిటీ సభ్యులు ఉన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న కుమ్మర శాలివాహన సంఘం అధ్యక్షులు పోతులయ్య, జితేంద్రగౌడ్

26న కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీల ధర్నా

పుట్టపర్తి రూరల్ : అంగన్వాడీలు కోరుతున్నది ప్రభుత్వం తీర్చలేని కోరికలు కాదని, అవి సామాన్యమైనవేనని వామపక్ష నాయకులు పేర్కొన్నారు. సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో శనివారం ప్రశాంతి గ్రామంలోని సిపిఎం కార్యాలయంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈఎస్ వెంకటేష్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, జిల్లా కార్యదర్శి వేమయ్య పాల్గొని ప్రసంగించారు. వారు మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలను తక్షణమే పరిష్కరించనిచో ఈ నెల 26వ తేదీ కలెక్టర్ కార్యాలయం వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బ్యాల్ల అంజి,సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాటమయ్య, ఆంజనేయులు, సిపిఐ రాష్ట్ర నాయకులు, పత్తికొండ రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ, వైఎస్ఆర్ కాలనీల్లో 'చిలకం' పర్యటన

ధర్మవరం టౌన్ : వైసిపి పాలనలో ఇందిరమ్మ, వైఎస్ఆర్ కాలనీల్లో ఒక్క మీటరు రోడ్డు వేయలేదని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. 'సేవ్ ధర్మవరం' కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన పట్టణంలోని ఇందిరమ్మ, వైఎస్ఆర్ కాలనీల్లో పర్యటించగా కాలనీల వాసులు రోడ్లు, డ్రైనేజీలు లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. చిలకం మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టిడిపి, జనసేన ప్రభుత్వం రావడం ఖాయమని, కాలనీల్లో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఆయన వెంట టిడిపి నాయకులు ఆంజనేయులు, రామచంద్ర, శ్రీరాములు, సుగుణ, జనసేన నాయకులు బెస్త శ్రీనివాసులు, నాగసుధాకర్‌రెడ్డి, అడ్డగిరి శ్యాంకుమార్, గొట్లూరు జివి, ప్యాదిండి వెంకటేష్, రాజ్ ప్రకాశ్, చిలకం సుధాకర్, కుమార స్వామి, ఆది, లక్ష్మీనారా యణ, నాగార్జున, ప్రతాప్, బాలకృష్ణ, అఖిల్ ఉన్నారు.

ఇందిరమ్మకాలనీలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న చిలకం మధుసూదన్‌రెడ్డి

విద్యకు అధిక ప్రాధాన్యత :ఎమ్మెల్యే

కదిరి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని వేమన ప్రభుత్వ పాఠశాలలో శనివారం ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎమ్మెల్యే ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం జగన్ విద్యారంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు, హెచ్ఎంలు, పాఠశాల ఛైర్మన్, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

బిసి భరోసా కరపత్రాలు పంపిణీ

మడకశిర : నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో శనివారం బిసి భరోసా కరపత్రాలను విడుదల చేశారు. తిప్పేస్వామి మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో బిసిల సంక్షేమానికి పెద్దపీట వేశారని, బిసిలను గుర్తించిన ఏకైక పార్టీ టిడిపి అని గుర్తుచేశారు. కార్యక్రమంలో సాధికార సమితి నాయీ బ్రాహ్మణ సత్యసాయి జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు, నియోజకవర్గ అధ్యక్షులు రమేష్, నాగేంద్ర, చంద్రశేఖర్, శివప్రసాద్, తిమ్మప్ప పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన జడ్జికి సన్మానం

పెనుకొండ : పట్టణంలోని బార్ రూమ్ లో శనివారం జిల్లా ప్రధాన జడ్జి శ్రీనివాసులును బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు, న్యాయవాదులు శివశర్మ, నాగిరెడ్డి, కృష్ణమూర్తి ఘనంగా సన్మానించారు. జిల్లా ప్రధాన జడ్జి కోర్టుల పని తీరుపై ఆరా తీశారు. కోర్టుల్లో కేసుల సత్వర పరిష్కారానికి సహకరించాలని, లోక్ అదాలత్‌లో రాజీ మార్గంలో కేసులు పరిష్కారం చేయడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎం.శంకర్రావు, జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ సయ్యద్, కోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు.



విద్యుత్ స్తంభాన్ని మార్చిన అధికారులు

ప్రజాశక్తి వార్తకు స్పందన
విద్యుత్ స్తంభం మార్పు

రొద్దం : మండల పరిధిలోని తురకలాపట్నం గ్రామంలో పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిలో ఎంపియుపి పాఠశాల ముందు సీసీ రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని విద్యుత్ శాఖ అధికారులు పది రోజుల క్రితం పక్కకు మార్చారు. సీసీ రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభంపై ఇటీవల ప్రజాశక్తిలో 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికతో వార్త ప్రచురితమైనది. దీంతో స్పందించిన అధికారులు సీసీ రోడ్డు మధ్య భాగంలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించి రోడ్డు పక్కన ఏర్పాటు చేశారు.

అవార్డు అందుకుంటున్న శంకర్ నారాయణ

గ్రీన్ భారత్ అధినేత శంకర్ నారాయణకు డాక్టరేట్

పుట్టపర్తి అర్బన్ : పర్యావరణ పరిరక్షణ కోసం హరిత విప్లవం సాధించడానికి నిరంతరం కృషి చేస్తున్న గ్రీన్ భారత్ ఫౌండేషన్ అధినేత రెడ్డివారి శంకర్ నారాయణ శనివారం ఢిల్లీలో సోక్రటీస్ సోషల్ రిసర్చ్ యూనివర్సిటీ ఛైర్మన్ యోగేష్ కుమార్ నుంచి ఇంటర్నేషనల్ డాక్టరేట్ అవార్డు అందుకు న్నారు. ఆయన మాట్లాడుతూ ఈ అవార్డు మరింత బాధ్యత పెంచిందని, గ్రీన్ భారత్ సాధించడమే ప్రధాన లక్ష్యమన్నారు.

ఎన్ఆర్ఐ అక్రమ అరెస్టుని ఖండిద్దాం : బికె

పెనుకొండ : అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తూ, భార్యాపిల్లలతో నివసిస్తున్న యశస్వి బొద్దులూరి అనారోగ్యంతో ఉన్న తన తల్లిని పరామర్శించడానికి శనివారం హైదరాబాద్ విమానాశ్ర యంలో దిగగానే, జగన్ నియంత ప్రభుత్వం అరెస్ట్ చేయడం దుర్మార్గం అని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఒక ఎన్ఆర్ఐ స్వేచ్ఛగా తన అభిప్రాయాలను వెల్లడించే హక్కుని కాలరాసి, రాజద్రోహ నేరంలా ఎయిర్‌పోర్టులో దిగగానే అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారను. అతడినిమ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

యువగళంతో వైసిపిలో వణుకు

కదిరి టౌన్ : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర శబ్దం వైసిపిలో వణుకు పుట్టించిందని మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ విమర్శించారు. పట్టణంలోని తన నివాసంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పాదయాత్ర లో రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన ఇబ్బందులను ప్రజలు గమనించారన్నారు. సిఎం జగన్ ప్రజల సంక్షేమాన్ని మరిచి స్వార్థ ప్రయోజనాల కోసం పాటుపడుతున్న చరిత్రహీనుడిగా నిలిచిపోతారని విమర్శించారు. సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, నాయకులు రాజశేఖర్ బాబు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి డికె బాబు ఆర్థికసాయం

తలుపుల : స్థానిక పూలబజార్‌కు చెందిన పూల మహబూబ్‌పీరా మృతి చెందాడు. విషయం తెలుకున్న డికె బాబు శనివారం వారి ఇంటికెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 10వేలు అందించారు. ఆయనతో పాటు ఎంపిపి రఫీనాయక్, ఫయాజ్ అహ్మద్, రమేష్, ఆటో బాషా, మాబ్బాషా, కార్యకర్తలు ఉన్నారు.

రమేష్

నాగ మంజుల

రైతు బిడ్డలకు ఎస్ఐ ఉద్యోగం

మడకశిర : రైతు కుటుంబంలో జన్మించి కాయ కష్టం చేసి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో నియోజకవర్గం నుంచి ఇద్దరు యువకులు ఎస్ఐ ఉద్యోగం సాధించారు. అగలి మండలం కురుసాంగనపల్లి గ్రామానికి చెందిన రైతు నాగరాజు కుమార్తె ఎస్ఐ పోస్టుకు ఎంపికైంది. మడకశిర మండలం కెఎస్ తండా గ్రామానికి చెందిన నారాయణనాయక్ కుమారుడు రమేష్ ఎస్ఐ ఉద్యోగానికి ఎంపికయ్యాడు.

నేడు శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ

బుక్కపట్నం : స్థానిక తేరు కూడలిలో బలిజ కులస్తుల సహాయ సహకారాలతో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయలు కాంస్య విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరిస్తున్నట్లు బలిజ సోదరులు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా, రాష్ట్రం నుంచి కాపు సంఘం నాయకులు హాజరవుతారని, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

పోరాట కాలం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికలు సమీస్తుండటంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఆయా పార్టీ నేతలు టిక్కెట్లు, గెలుపోటములపై దృష్టి సారించారు. ఇదే సమయంలో కార్మికులు, ఉద్యోగులు, తమ సమస్యల పరిష్కారానికి పోరాటమార్గాన్ని ఎంచుకున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని నాలుగేళ్లు అడుగుతూ వచ్చిన ఉద్యోగులు, కార్మికులు ఇక పోరాట మార్గాన్ని ఎంచుకున్నారు. ఇచ్చిన మాట నిలుపుకోవాలని చేస్తున్న పోరాటాలు ఉవ్వెత్తున ఎగిశాయి. ఎన్నికల సమయంలోనైనా అంతక ముందు ఇచ్చిన మాటను నిలుపుకోవాలని అడుగుతున్నారు. ఒకవైపు అధికార వైసిపి ఏమో 99 శాతం మేనిఫెస్టోను అమలు చేశామని ప్రచారం చేస్తోంది. అయితే ఈ హామీల పరిస్థితి ఏంటని ఉద్యోగులు, కార్మికులు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. కానీ ప్రభుత్వం దీన్ని ఏ మాత్రం పట్టించుకునే పరిస్థితులు కనిపించకపోవడంతో పోరాటాన్ని తీవ్రతరం చేస్తున్నారు. ప్రధానంగా అంగన్‌వాడీల చేపట్టిన సమ్మె ఉధృతమైంది. మహిళలు పెద్దఎత్తున పోరాటాన్ని చేపట్టడంతో ప్రభుత్వం ఏం చేయాలో పాలుపోక సమ్మెను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేపట్టింది. సచివాలయ ఉద్యోగుల చేత అంగన్‌వాడీ కేంద్రాలు ప్రారంభిస్తోంది. అయితే కేంద్రాలు తెరచినప్పటికీ పిల్లలకు అందాల్సిన సేవలు అందించడం లేదుగానీ, వారే ఆడుకోవడం వంటివి కనిపించాయి. అయితే ప్రభుత్వం ఏదో సమస్యకు పరిష్కారం చూపినట్టు కలరింగు ఇచ్చే ప్రయత్నామూ చేసింది. అంగన్‌వాడీ కేంద్రాలకు బకాయి ఉన్న అద్దెలు, ఇతర వాటిని పరిష్కరిస్తున్నట్టు ప్రకటించింది. కనీస వేతనం, ఉద్యోగ బద్రత అంశాలేవి ప్రస్తావించకపోవడం గమనార్హం. ఇదే సమయంలో ఆశా వర్కర్లు తమ సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన బాటపట్టి ఉన్నారు. మరోవైపు ఎస్ఎస్ఎ ఉద్యోగులు నాలుగు రోజులుగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. వచ్చే వారంలో మున్సిపల్ వర్కర్లు సమ్మెకు దిగబోతున్నారు. ఈమేరకు ఇప్పటికే అధికారులు, ప్రజాప్రతినిధులకు సమ్మె నోటీసులు అందజేశారు. వీరందరూ అడుగుతున్నది ఒక్కటే ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతున్నారు. కొన్ని నెలల్లో ఎన్నికలొస్తున్నందున ఇప్పటికైనా ఈ హామీలు అమలు చేయాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం వీటిని ఏ మాత్రం పట్టించుకునేందుకు ముందుకు రాకపోగా, ఆందోళనలను అణచిపెట్టే ప్రయత్నం చేయడం విమర్శలకు తావిస్తోంది. ఇంకో వైపు ఉపాధ్యాయులు సైతం ప్రభుత్వంపై అసంతృప్తితోనే ఉన్నారు. గత వారంలో ఒక ఉపాధ్యాయుడు రుణభారంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనికి కారణం బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించలేకపోవడమేనని తెలుస్తోంది. నెలనెల జీతాలు సకాలంలో రాకపోవడంతో చెల్లించాల్సిన బ్యాంకు రుణం వాయిదాలు చెల్లించలేకపోవడంతో సివిల్ స్కోరు పడిపోతోంది. ఇది రాబోయే రోజుల్లో ఎప్పుడైనా రుణం తీసుకుందామంటే తీసుకోలేని పరిస్థితి వస్తోందని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం నెలనెలా వేతనాలు సక్రమంగా చెల్లించాలన్న డిమాండ్‌ను ఉద్యోగులు చేస్తున్నారు. ఇలా అనేక ఉద్యోగులు, కార్మికులు తమ సమస్యలపై పోరాటాన్ని సాగిస్తుండటంతో పోరాటాలు పదునెక్కాయి. ఇక ఈ వారంలో చలి తీవ్రత పెరగడంతో మంచు పడుతుండటం కారణంగా ప్రమాదాలు పెరుగుతున్నాయి. ఇకపోతే అనంతపురం రూరల్‌లో లారీ, ఐచర్‌ను ఢీకొట్టి ముగ్గురు మృతి చెందగా, శనివారం ఉదయం కల్లూరు వద్ద జరిగిన ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. ఈ సీజన్‌లో మంచు కారణంగా జరిగే ప్రమాదాలతో అప్రమత్తతో వ్యవహరించాల్సిన అవసరముంది.

ఘనంగా వైకుంఠ ఏకాదశి

భక్తులతో పోటెత్తిన ఆలయాలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

ధనుర్మాసం శుక్లపక్షంలో వచ్చే ముక్కోటి ఏకాదశి రోజున మూడు కోట్ల మంది దేవతలు భూలోకానికి వచ్చి శ్రీమహా విష్ణువును పూజిస్తారని పురాణాలు చెబుతున్నాయి. ఈ రోజున ఆలయాల్లో ఉత్తర ద్వారం గుండా విష్ణుమూర్తిని దర్శిస్తే సమస్త పుణ్యపరంపరలు చేకూరతాయని భక్తుల విశ్వాసం. అందుకే తెల్లవారుజామునే స్వామివారి దర్శనార్థం ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. పట్టణంలో వెలసిన ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఎమ్మెల్యే డాక్టర్ పివి.సిద్ధారెడ్డి దంపతులు పల్లకి సేవ చేసి అనంతరం ఉత్తర గోపుర దర్శనం చేసుకున్నారు. శ్రీవారి సేవలో ఆలయ కమిటీ ఛైర్మన్ గోపాలకృష్ణ, కార్యనిర్వాహణ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన అర్చకులు, కమిటీ సభ్యులు, పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, యశోదదేవి దంపతులు ఉత్తర గోపురం ద్వారంలో దర్శించుకొన్నారు. ఉత్తర ద్వారంలో ప్రత్యేక పుష్ప అలంకరణలో ఖాద్రీ నృసింహుడు శ్రీదేవిభుదేవి సమేతంగా కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. కర్నాటక నుంచీ భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. దీంతో ఆలయంతో పాటు మాడా వీధుల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యూ లైన్ల లో భక్తుల రద్ది కొనసాగింది. ఆలయ అధికారులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసారు. డీఎస్పీ శ్రీలత ఆధ్వర్యంలో పట్టణ సిఐ నారాయణరెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తుండా బస్సులు, భారీ వాహనాలను బైపాస్ మీదుగా దారిమల్లించారు.

హిందూపురం : పట్టణంలోని పేట వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోవాడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈ సందర్బంగా ఆలయ కమిటీ నిర్వహకులు వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఉత్తర ద్వారా దర్శనాన్ని కల్పించారు. దీంతో పాటు పట్టణంలోని లక్ష్మీపురంలో వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి, గుడ్డం రంగనాథ స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్బంగా వైసిపి ఇన్‌ఛార్జి దీపిక వేణురెడ్డితో పాటు మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ పేట వెంకటరమణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి ఆశీర్వాదం తీసుకున్నారు. లక్ష్మీపురం ఆలయంలో అన్నదానం కోసం వైసిపి నేత కొండూరు వేణుగోపాల్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీపురం శ్రీ బాలాజీ దేవాలయం నందు నిత్య ప్రసాద వినియోగ కార్యక్రమానికి రూ.20,116లను కమిటీ సభ్యులకు అందజేశారు.

మడకశిర : స్థానిక లక్ష్మీవెంకటేశ్వస్వామి ఆలయంలో నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి సతీసమేతంగా ఉత్తర ద్వారం ద్వారా వెళ్లి స్వామి వారిని దర్శించుకు న్నారు. నీలకంఠాపురంలోని నీలకంఠేశ్వరస్వామి, రొళ్ల మండలం కొత్త తిరుపతిలోని వెంకటేశ్వరస్వామి, రొళ్లలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి.

కదిరి : స్వామివారి సన్నిధిలో ఎమ్మెల్యే సిద్ధారెడ్డి దంపతులు

మడకశిర రూరల్ : మండల పరిధిలోని నీలకంఠాపురం గ్రామంలో వెలసిన నీలకంఠేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం వైకుంఠ ఏకాదశి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సిడబ్ల్యుసి సభ్యులు రఘువీరారెడ్డి దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి పర్వదినం కావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారి దర్శనార్థం బారులు తీరారు. గోవిందనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి.

వెండి శఠారి వితరణ

నీలకంఠేశ్వరస్వామి దేవస్థానానికి నెల్లూరు జిల్లాకు చెందిన ఉడత వెంకట్రావు ఆలయానికి వెండి శఠారి, పళ్లెం అందజేశారు. కార్యక్రమంలో ఉడత వెంకట్రావు, రాజేశ్వరి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : స్థానిక నాగుల కణంపై వెలసిన వెంకటేశ్వరస్వామి, షిరిడీ సాయిబాబా ఆలయాలు, మండల పరిధిలోని ఇళ్లవెంకటంపల్లి గ్రామంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ఆలయాలను రంగురంగుల పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారిని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, రాష్ట్ర వైసిపి సిఇసి సభ్యులు సోమశేఖర్‌రెడ్డి, తదితర ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వెండి శఠారి అందజేస్తున్న ఉడత వెంకట్రావు

నీలకంఠేశ్వరస్వామి దేవస్థానంలో రఘువీరా కుటుంబ సభ్యులు

చేనేతల సమస్యలపై కేంద్రమంత్రికి వినతి

ప్రజాశక్తి-హిందూపురం

చేనేతలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కషి చేయాలని కేంద్ర టెలీ కమ్యూనికేషన్ శాఖ మంత్రి దేవసిన్హ్ చౌహాన్‌కు తొగట వీర క్షత్రియ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సురువు శ్రీలత మధు కోరారు. ఈ మేరకు శనివారం ఆర్టీసీ కాలనీలో కేంద్రం మంత్రిని కలిసి చేనేతల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేసి సమస్యలను వివరించారు. సత్యసాయి జిల్లాలో అతి పెద్ద వ్యవస్థ చేనేత పరిశ్రమ అని, వ్యవస్థపై జిల్లాలో సుమారు మూడు లక్షల పైగా జనాభా ఆధారపడి ఉందన్నారు. చేనేత వస్త్రాల జీఎస్టీ ఎత్తేయాలన్నారు. చేనేత పరిశ్రమకు ముడిసరు కును ప్రభుత్వమే సబ్సీడి ద్వారా అందించాలన్నారు. పరిశ్రమ అభివద్ధికి పవర్ లూమ్స్ తరహాల్లో పని ముట్లు ఇవ్వాలన్నారు. చేనేతలకు ముద్ర లోన్స్ బ్యాంకుల ద్వారా అందించాలని, కర్ణాటక సిల్క్ బోర్డు తరహాలో ఆంధ్ర సిల్క్ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. అదే విధంగా పవర్ లూము కేంద్ర ప్రభుత్వ సబ్సిడీని 40 శాతం పెంచాలని, జీఎస్టీ ఎత్తి వేయాలని కోరారు. కార్యక్రమంలో ఆంజనేయులు, మంచాల రామాంజి, జానకిరామ్, శ్రీవర్ధన్ పాల్గొన్నారు.

2024 క్యాలెండర్ ఆవిష్కరణ

ఓబుళదేవరచెరువు : స్థానిక జడ్పి హైస్కూల్‌లో శనివారం డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గౌస్ లాజమ్ ఆధ్వర్యంలో డిటిఎఫ్-2024 క్యాలెండర్‌ను డిఇఒ యు.మీనాక్షి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సురేష్‌బాబు, రమణ, హెచ్ఎం శోభారాణి, మండల అధ్యక్షుడు సోమశేఖర్ నాయక్, ఎంసి నర్సింహులు, జిల్లా సభ్యులు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్ హనుమంతుకు ఉత్తమ సమాజ సేవా పురస్కారం

మడకశిర : జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జాబిల్లి చాంద్‌బాషా అధ్యక్షతన టిప్పుసుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు కెఎం ఉమర్ ఫరూఖ్ ఖాన్ ఆధ్వర్యంలో శనివారం ఉత్తమ సమా జ సేవా పురస్కారాలు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా పెనుకొండ డీఎస్పీ హుస్సేన్‌పీరా, రవి శంకర్ గురూజీ నుంచి దళిత హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్ హనుమంతు పురస్కారం అందుకున్నారు. హనుమంతు మాట్లాడుతూ 84 సార్లు రక్తదానం చేశానని అందులో అన్ని మతాలు, కులాల వారికి చేశానన్నారు. భవిష్యత్తులో కూడా రక్త దానం చేస్తూ సమ సమాజ స్థాపన నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు.

'ఆడుదాం ఆంధ్ర'పై అవగాహన ర్యాలీ

గుడిబండ : 'ఆడుదాం ఆంధ్ర'పై శనివారం ఎంపిడిఒ రామారావు ఆధ్వర్యంలో స్థానిక జడ్పి హైస్కూల్ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు నినాదాలు చేస్తూ పుర వీధుల గుండా ర్యాలీగా వెళ్లి అనంతరం పాఠశాలకు చేరుకున్నారు. ర్యాలీలో ఎఒ నారాయణప్ప, పిఇటి అజరుద్దీన్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంజిఎం పాఠశాలను పరిశీలన చేస్తున్న జెసి

ఎంజిఎం పాఠశాల పరిశీలన

హిందూపురం : సాధరణ ఎన్నికల నేపథ్యంలో జిల్లా జయింట్ కలెక్టర్, హిందూపురం అసెంబ్లీ ఎన్నికల అధికారి అభిషేక్ కుమార్ స్థానిక అధికారులతో కలిసి పరిశీలన చేశారు. ఎంజిఎం పాఠశాలలో డిస్ట్రిబ్యూషన్ కౌంటర్, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేయాడానికి తగిన వసతులను ఏర్పాటుకు తనఖీ చేశారు. అనంతరం ఎన్నికల అధికారుల వసతి కోసం రూరల్ మండలం కిరికెర వద్ద ఉన్నా సిరికల్చర్ అథితి గృహాన్ని పరిశీలన చేశారు. అదే విధంగా ఓట్ల చేర్పులు, మార్పులపై పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ స్వర్ణలత, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, ఎంపీడీఒ నరేంద్ర, సెరికల్చర్ ఏడీ సురేష్, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ రెడ్డి శేఖర్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రోత్సాహకాలు

పుట్టపర్తి క్రైమ్ : ఆర్టీసీలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు శనివారం డిపో మేనేజర్ ఇనయతుల్లా నగదు బహుమతులు అందజేశారు. ఈ మేరకు శనివారం డిపోలో అభినందన సభ ఏర్పాటు చేశారు. బహుమతులు పొందిన వారిలో కండక్టరు ఎల్ఎన్.నాయక్, ఎం.వెంకటేశ్వర్లు, కొండారెడ్డి, నజీర్, డ్రైవర్లు ఎండిఆర్ ఖాన్, నాగేంద్ర, కేశప్ప ఉన్నారు. డిపో మేనేజర్ మాట్లాడుతూ ఆర్టీసీని లాభాల బాటలో నడిపించడానికి ఉద్యోగులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టిఐ పెద్దన్న, ట్రాఫిక్ సూపర్వైజర్లు, సెక్యూరిటీ సిబ్బంది, యూనియన్ నాయకులు షబ్బీర్, రమణప్ప, ముత్యాలు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ రైతు దినోత్సవ వేడుకలు

పెనుకొండ : పట్టణంలోని ప్రగతి, గ్లోబల్ జెన్ విద్యా సంస్థల్లో శనివారం కరస్పాండెంట్ యు. శ్రీనివాసులు అధ్యక్షతన రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక నృత్యాలు, వేషధారణలు అలరించాయి. విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. శ్రీనివాసులు రైతు దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. పాఠశాల ఆవరణలో పల్లె వాతావరణం ఏర్పాటు చేయగా విద్యార్థులు రైతుబజార్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మంజువాణి, డైరెక్టర్స్ సాయిశ్రీధర్, సాయిసృజన, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మవరం : రైతుల వేషధారణలో చిన్నారులు

గుడిబండ : మండల పరిధిలోని మందలపల్లి గ్రామంలో ఎపి మాస్, ఎఫ్‌పిఒ ఆధ్వర్యంలో రైతు దినోత్సవం నిర్వహించారు. వ్యవసాయంలో మహిళల పాత్ర, ఆధునిక వ్యవసాయ విధానాలు, రైతు అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలు, రైతు సంఘాల ఏర్పాటు లక్ష్యం, నిర్వహణపై అవగాహన కల్పించారు. మహిళలను గ్రూపులుగా ఏర్పాటు చేసి సంబంధించిన ప్రశ్నలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అంతజేశారు. కార్యక్రమంలో ఎపి మాస్ డైరెక్టర్ గోపాల్‌రాజు, సిసి దేవరాజు, జనరల్ సిసి ఆదిల్‌బాషా, మాస్ అనిల్ కుమార్, మహిళా రైతులు, యానిమేటర్లు పాల్గొన్నారు.

కాకతీయ విద్యానికేతన్‌లో జాతీయ రైతు దినోత్సవం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్‌లో శనివారం జాతీయ రైతు దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రైతు జీవనశైలి, దేశానికి చేస్తున్న సేవలు, శ్రమ విద్యార్థులకు అర్థమయ్యేలా 'రైతే రాజు' నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నిర్మలా జయచంద్రారెడ్డి, డైరెక్టర్లు శెట్టిపి సూర్యప్రకాశ్, పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

ఓబుళదేవరచెరువు : వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలను డిఇఒ మీనాక్షి సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం సబ్జెక్టుల వారీగా విద్యాభ్యాసం గురించి ఆరా తీశారు.

విద్యార్థులకు మోడల్ పేపర్లు పంపిణీ

గాండ్లపెంట : మండల పరిధిలోని కటారుపల్లి కెజిబివి, తుమ్మలబైలు, నీరుకుంట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శనివారం పదో తరగతి విద్యార్థులకు ఎంఇఒ-2 శ్రీనివాసులు మోడల్ ప్రశ్నపత్రాలను పంపిణీ చేశారు. వాటిని కటారుపల్లికి చెందిన మొబైల్ షాప్ యజమాని షౌకత్ అలీ, మాజీ సర్పంచ్ శ్రీలతరమణారెడ్డి ఆర్థికసాయంతో అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి చెన్నూరు తాహెర్‌అలీ, హెచ్ఎం పిటిఎం మర్షాద్ అలీ, అప్పిరెడ్డి, ఎస్ఓ దుర్గ, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కదిరిగేట్ నిర్వాసితులకు ఊరట

ధర్మవరం టౌన్ : పట్టణంలోని కదిరిగేట్ నిర్వాసితులకు ఊరట లభించింది. కదిరిగేట్ వద్ద రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లను తొలగించకుండా మరో 4 వారాలు స్టే పొడిగిస్తూ హైకోర్టు న్యాయ మూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. సంబంధిత ఆర్డీఓ రమేశడ్డి, తహశీల్దార్ యుగేశ్వరీదేవి, రోడ్లుభవనాల శాఖ ఇఇ సంజీవయ్యలకు జనవరి 4వ తేదీలోపు నోటీసులు జారీ చేయాలని ఉతర్వుల్లో పేర్కొన్నారు.

వైసిపి లీగల్ సెల్ జిల్లా అధికార ప్రతినిధిగా ఎం.భాస్కర్ రెడ్డి

పెనుకొండ : వైసిపి లీగల్ సెల్ జిల్లా అధికార ప్రతినిధిగా సీనియర్ న్యాయవాది ఎం.భాస్కర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వైసిపి లీగల్ సెల్ సమావేశం నిర్వహించగా పెనుకొండ నుంచి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ న్యాయవాదులు, వైసిపి లీగల్ సెల్ సభ్యులు తరలివెళ్లారు. సమావేశంలో సీనియర్ న్యాయవాది చంద్రశేఖర్‌రెడ్డి, నాగేశ్వరి, కమలాకర్‌రెడ్డి, విశ్వనాథ్‌నాయక్, సుబ్బు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవిజ్ఞాన్ స్కూల్‌లో ప్రీ క్రిస్మస్ సంబరాలు

ఓబుళదేవరచెరువు : స్థానిక వడ్డివారిపల్లి సమీపంలో వున్న శ్రీవిజ్ఞాన్ సిబిఎస్ఇ పాఠశాలలో శనివారం ప్రీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కరస్పాండెంట్ మస్తాన్‌వలి మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా అంద రూ జరుపుకునే క్రిస్మస్ వేడుకల్లో దేవుని ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు. అంతకుముందు జాతీయ గణిత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రంగారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ఫర్యాజ్, ఉపాధ్యాయులు, చిన్నారి పిల్లలు పాల్గొన్నారు.

శ్రీవిజ్ఞాన్ సిబిఎస్ఇ పాఠశాలలో క్రిస్మస్ సంబరాలు